క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్ గుట్టపై ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ సోమ లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు గురు, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జగద్గురు శ్రీ వేమనారాధ్య పీఠాధిపతి శ్రీ పూర్ణానంద స్వామి సమక్షాన ఈ వేడుకలు జరుగుతాయని వెల్లడించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీవాసులు

కామేపల్లి: మండలంలోని గోవింద్రాలబంజర ఎస్సీ కాలనీ వాసులకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, కాలనీ అభివృద్ధిపై అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు బుధవారం బురదమయంగా ఉన్న వీధిలో నిరసన తెలిపారు. తమ సమస్యలపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, రమణమ్మ, రామ్మూర్తి పాల్గొన్నారు.

పచ్చదోమల నియంత్రణపై అవగాహన ఉండాలి

రఘునాథపాలెం: పత్తి పంటలో పచ్చ దోమల నియంత్రణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం మండలంలో పత్తి పంట ఆశాజనకంగా ఉండగా.. వర్షాలతో అక్కడక్కడ ఎర్రబారినట్లు తెలిసిందన్నారు. పత్తిలోని పచ్చదోమల నియంత్రణకు లీటర్ నీటిలో 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 0.2 గ్రాముల ఎసిటామిప్రిడ్ లేదా 1.25 గ్రాముల డైఫెన్ థయురాన్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. తగిన మోతాదులో మందులు వాడితేనే మంచి ఫలితాలు వస్తాయని, పంట దిగుబడులు కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన మల్లెమడుగు వద్ద బుధవారం రాత్రి ఓ వృద్ధుడు(65) ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు.అయితే, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ పోలీసులు చెప్పారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కూసుమంచి: భార్యాభర్తల నడుమ గొడవపై పంచాయితీ నిర్వహిస్తుండగా.. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. దంపతులైన సూర్యాపేటకు చెందిన యువతి, కల్లూరుకు చెందిన యువకుడి మధ్య వివాదం నెలకొనడంతో బుధవారం పెద్దమనుషులు కూసుమంచిలో పంచాయితీ నిర్వహించారు. పంచాయితీ ముగిశాక ఇరువర్గాల వారు ఘర్షణకు దిగడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. అలాగే, పలువురిపై కేసు నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు.

సృజనోత్సవ్‌లో అవార్డు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, స్వరమహతి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సృజనోత్సవ్‌లో ఖమ్మంకు చెందిన గుత్తికొండ మాన్వి ప్రతిభ చాటి కూచిపూడి నృత్య ప్రదర్శనలో అవార్డు అందుకుంది. ఖమ్మంలోని మమత డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు - డాక్టర్ అనితారావు కుమార్తె అయిన మాన్వి ప్రతిభ చాటడంపై నృత్యగురువు లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్



కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	48	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	20	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	56	తోటకూర	4
దొండ	24		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	46		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		25
చామగడ్డ	38	పుదీన	1
క్యారెట్	56		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	



నారు తీస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

కష్టాల సాగు..

పంటల సాగుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. ఓ వైపు పెరిగిన పెట్టుబడి.. మరోవైపు కూలీల కొరత వేధిస్తుండగా.. సకాలంలో పంట రుణాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పాలేరు నియోజకవర్గంలో వరి నారుమళ్లు సిద్ధమై నెల దాటినా సన్న, చిన్న కారు రైతులు కొందరు నాట్లు వేసుకునేందుకు ముందుకొచ్చే పరిస్థితి లేదు. కూలీల కొరతతో యంత్రాల కోసం ఎదురుచూస్తున్నారు. నారు ముదురుతుండడంతో చేసేదేమి లేక ఇతర రాష్ట్రాల కూలీలతో నాట్లు వేయించుకుంటున్నారు.



నాటు వేస్తున్న కూలీలు

పంటల సాగుకు.. అప్పుల తిప్పలు

- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న వైనం
- యంత్రాల కోసం ఎదురుచూపులు
- అవస్థలు పడుతున్న రైతాంగం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గం పాడి పంటలకు నిలయంగా వర్ధిల్లుతోంది. కానీ ప్రస్తుతం రైతులకు పెరిగిన ఖర్చుల కారణంగా అవస్థలు పడుతున్నారు. ఒక వైపు వ్యవసాయ కూలీలు తమకు కూలి గిట్టుబాటు కాక ఇతర పనులకు వెళ్తున్నారు. దీంతో రైతులు చేసేదేమి లేక ఇతర రాష్ట్రాల కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

ఎకరానికి అయ్యే సాగు ఖర్చు..

ట్రాక్టర్‌కు	రూ.6,000
20 కేజీల విత్తనాలకు	రూ.1,000
కూలీల నాటుకు	రూ.6,000
దుక్కి మందుకు	రూ.2,000
ఎరువులకు	రూ.1,500
దుగాలు చెక్కినందుకు	రూ.3,000
కలుపు మందుకు	రూ.2,000
వరి కోతకు	రూ.2,500

పశు సంపద లేక..

గ్రామాల్లో పశు సంపద తగ్గుముఖం పట్టడంతో రైతులు యంత్రాలపై ఆధారపడాల్సి వస్తోంది.

పెరుగుతున్న ఖర్చులతో ఎకరానికి దాదాపు రూ.24 వేల వరకు పైగా పెట్టుబడి అవుతుందని రైతులు వాపోతున్నారు. అందినకాడికల్లా అప్పులు చేసి.. సాగు చేద్దామంటే కూలీలు దొరకని పరిస్థితి. మహిళలకు రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు ఇస్తామన్నా.. పనులకు రావడం లేదు. దీంతో కొందరు బిహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయిస్తున్నారు.

ఖర్చులు నియంత్రించాలి..



వరి నాట్లు వేసే రైతులకు ఏటేటా ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప వాటి నియంత్రణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అందిన కాడికల్లా అప్పులు తీచ్చి సాగు చేయాల్సి వస్తోంది. వ్యవసాయాధికారులు సూచనలు చేయాలి.

– ఆనం వెంకటరెడ్డి, రైతు, అనంతనగర్

ప్రత్యేక రుణాలు అవసరం..



రైతులకు సాగు పెట్టుబడి కష్టంగా ఉంది. ప్రతీ సీజన్‌లో నాట్లు వేసే సమయాన ప్రత్యేక రాయితీలతో రుణాలు అందించాలి. అలాగే కౌలు రైతులకు రుణాలు అందించే ఏర్పాట్లు చేసి ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రచ్చా నరసింహారావు, రైతు సంఘం నేత

నూతన పద్ధతులతో మేలు..



నూతన పద్ధతులు అవలంబిస్తూ.. సాధ్యమైనంత వరకు సొంతంగా పనులు చేసుకుంటే ఖర్చులు తగ్గుతాయి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగుతో పాటు పాడి, చేపలు పెంపకం, కూరగాయలు పండించుకోవాలి.

– ఎం.రాధ, ఏఈ

ప్రజా సమస్యలపై పట్టింపు కరువు



డ్రెయినేజీ పక్కన వ్యర్థాలను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కొందరు కార్పొరేటర్లు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తమ సొంత వ్యాపారాలు చూసుకుంటూ బాధ్యతలను విస్మరించారని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ విమర్శించారు. బుధవారం నగరంలోని 44వ డివిజన్‌లో సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన నాయకులు పాత సీపీఎం ఆఫీస్ రోడ్డు, బాలాజీనగర్ ప్రాంతాలను సందర్శించి డ్రెయినేజీలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రెయినేజీల్లో మురుగు ఎత్తేవారు లేరని, దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కార్పొరేటర్లకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టూటౌన్ కమిటీ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నాగరాజు, మచ్చా సూర్యం, డి.వీరబాబు, భద్రం, సుభాష్, షఫీ, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

నూతన సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: గోల్‌తండాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కూసుమంచిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కామేపల్లిలో..



నేలకొండపల్లిలో..



అటెన్షన్ ప్లీజ్

కంపు కొడుతోంది..!







అధ్వానంగా మరుగుదొడ్లు, పరిసరాలు

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతోంది. దీంతో పేషంట్లు అందులోకి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతుండగా.. సరైనా వసతులు, వైద్యం అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు ఉండడం లేదని, ఫ్యాన్లు తిరగడం లేదని వాపోతున్నారు. కొందరు సిబ్బంది.. పేషంట్లు, వారి సహాయకులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. – ఖమ్మంవైద్యవిభాగం

వినతులు..

● రైతు కమిషన్ చైర్మన్‌కు..



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కామేపల్లి: పోడు భూముల రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్, డైరెక్టర్లు కోదండ రామ్‌రెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాములునాయక్, భూభారతి చట్టం సభ్యులు సునీల్‌కు బుధవారం హైదరాబాద్‌లో కామేపల్లి కాంగ్రెస్ మండల నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఇల్లెందు ఏఎంసీ డైరెక్టర్ మాలోత్ భావ్‌సింగ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వరికొల్లు సైదులు, మండల యువజన అధ్యక్షులు దొడ్ల వేణ, దేవండ్ల రామకృష్ణ, బత్తుల ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

● తిరుమలాయపాలెం సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. వీధిలైట్లు వెలగడం లేదని, సైడ్ కాల్వలు తీయాలని, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సబ్ స్టేషన్ పక్కన దారి బురదమయంగా మారిందని విన్నవించారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, సెంటర్లలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, గ్రామశాఖ కార్యదర్శి నెర్సుల వెంకటేష్, నాయకులు మద్దినేని శ్రీనివాస్, నవీన్, కొమ్ము నాగేశ్వరరావు, ముత్తయ్య, పుల్లయ్య, ముత్తయ్య స్వాతిముత్యం తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

కూసుమంచి: ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 23న చేపట్టనున్న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, అందుకే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ధర్నాను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు యాకయ్య, రాంకోటి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): భద్రాద్రి కొత్తగూడెం గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన పసుపులేటి వీరబాబును జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం రాపర్తినగర్ శెట్టి రంగారావు నివాసంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పసుపులేటి దేవేందర్, మున్నూరు కాపు ట్రస్ట్ బోర్డు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య,నరసింహారావు, శ్రీనివాసరావు, జి.శ్రీదేవి, దేవిశెట్టి వెంకటేశ్వరావు, పూర్ణచంద్రరావు, విష్ణుకుమార్, శంకరయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుల బారిన పడొద్దు



సదస్సులో పాల్గొన్న ఎస్‌బీఐ ఆర్‌ఎం రాజశేఖర్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: సైబర్ నేరస్తుల మాటలు నమ్మి బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు మోసపోవద్దని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ బి.రాజశేఖర్ సూచించారు. ఖమ్మం టౌన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆర్‌ఎం మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల పేరిట వచ్చే ఫోన్లకు నమ్మి మోసపోవద్దని తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీంధర్ మాట్లాడడంతో పాటుప్రజల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన వారిని సత్కరించారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సతీష్

నేలకొండపల్లి: రైతులకు ఎరువులను ఎక్కువ ధరకు అమ్మినట్టు కానీ, యూరియాతో పాటు వేరే ఏదైనా లింకు పెట్టి అమ్మినా చర్యలు తప్పవని కూసుమంచి సహాయ సంచాలకులు ఎం.సతీష్ హెచ్చరించారు. బుధవారం నేలకొండపల్లి రైతు వేదికలో ఎస్సై సంతోష్‌తో కలిసి నిర్వహించిన ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల అవసరాల మేరకు యూరియా అందించాలని, నానో యూరియాపై అవగాహన కల్పించాలని, ఎరువుల స్టాక్ అప్డేట్ చేయాలన్నారు. అనంతరం ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాధ, ఏఈఓలు అరవింద్, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

● విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



టై, బెల్టులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వృశాలి, స్వాతి టై, బెల్టులు, గుర్తింపు కార్డులు సమకూర్చగా.. ఎంఈఓ బీవీ రామాచారి బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● మంగాపురంతండాలో బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు..



బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా పాఠశాల విద్యార్థులకు బుధవారం చేతన ఫౌండేషన్ సభ్యులు సురేష్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గోవిందరావులు బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు సమకూర్చగా.. ఎంఈఓ చలపతిరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వీ.ఓ చంద్రావతి, ఐఈఆర్పీ సాంబశివరావు, ఉపాధ్యాయులు ఉపేందర్, వెంగళరావు పాల్గొన్నారు.

● పాన్నేకల్‌లో టీషర్టులు..



టీషర్టు అందిస్తున్న ఎంఈఓ వెంకట్

కామేపల్లి : మండలంలోని పాన్నేకల్ హైస్కూల్ విద్యార్థులకు బర్లగూడెం ఉద్యోగ సంఘం సభ్యులు రూ.20 వేలు, మహేందర్ జైన్ రూ.8 వేలు, పూర్వ విద్యార్థులు రూ.2 వేలు సహకారంతో బుధవారం యూనిఫాంకు సంబంధించిన టీషర్ట్‌లను ఎంఈఓ వెంకట్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాక గతేడాది పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు కృషి చేసిన హెచ్‌ఎం కోటేశ్వరమ్మను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి పాపాలాల్, బర్లగూడెం ఉద్యోగ సంఘం సభ్యులు బానోత్ వీరూనాయక్, బాలునాయక్, రామారావు, రవి, వడియాల కృష్ణారెడ్డి, కోదాటి శ్రీనివాస్, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో దయాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 54 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడా మంగీలాల్, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, నాయకులు వున్నం రాజశేఖర్, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఇటీవల జిల్లా అభ్యుదయ పద్మశాలి సంఘ సభ్యుడు దేవసాని వీరకృష్ణ మృతిచెందగా.. ఆయన దశదిన కార్యక్రమానికి సంఘం ఆధ్వర్యాన రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జల్లా వెంకటేశ్వర్లు మృతుడి కుటుంబసభ్యులకు అందివ్వగా.. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, జి.సూర్యప్రకాశరావు, కొండ పద్మ, మోతుకూరి విజయశాంతి, జి.నాగేశ్వరరావు, వి.గోవర్దన్, రుద్ర ప్రదీప్, పెద్ద వెంకన్న, పాండు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగ్‌ల ధరపై చర్చ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ బాధ్యులు బుధవారం పలు రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గన్నీ బ్యాగుల ధరపై చర్చించారు. ఎనిమిదేళ్ల క్రితం నిర్ణయించినట్లుగా గన్నీ బస్తా ధర రూ. 25గానే కొనసాగుతుంది. బహిరంగ మార్కెట్‌లో నాణ్యతా ఆధారంగా రూ.70 నుంచి రూ.80 వరకు ధర ఉంది. అయినా వ్యాపారులు పాత ధరే రైతులకు చెల్లిస్తున్నారని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈక్రమాన రూ.40, రూ.50, రూ.70 చెల్లించాలనే సూచనలు రాగా.. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాత్రం గన్నీ బస్తాలతో విక్రయాలు తగ్గాయని వివరించారు. అయినా బస్తాల ధర పెంపు అంశాన్ని పరిశీలించాలనే భావనలో ఉన్నారు. మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, రైతు సంఘాల ప్రతినిధులు నల్లమల వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, రాంబాబు, రాము, పాషా తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న 'బుగ్గవాగు'..



బుగ్గవాగు వంతెనపై పారుతున్న వరద

- పోటెత్తుతున్న వరద
- తెల్లారే సరికి 4 అడుగుల ఎత్తులో ప్రవాహం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

రఘునాథపాలెం: ఎగువ భాగంలో ఏ చిన్న వర్షం పడినా క్షణాల్లో బుగ్గవాగు వరద బారుతోంది. దీంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు రేపుతోంది. సమీప గ్రామాల్లో వర్షం పడకపోయినా అకస్మాత్తుగా వాగు పొంగుతూ రహదారిపైకి దూసుకొస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు ఎలాంటి ప్రభావం లేని బుగ్గవాగు తెల్లారే సరికి వంతెనపై 4 అడుగుల ఎత్తులో నాలుగైదు గంటల పాటు పారడంతో మండలంలోని వీఆర్‌బంజర గ్రామస్తులు నానా అవస్తలు పడాల్సి వచ్చింది. రఘునాథపాలెం మండలం నుంచి ఖమ్మం-డోర్నకల్ రహదారి పాపటపల్లి వీఆర్ బంజర మధ్య ఉన్న ఈ వంతెనపై గత పది రోజులుగా వరద వస్తుండడంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఎప్పుడు వరద వస్తుందో, ఎప్పుడు తగ్గుతుందో తెలియని పరిస్థితి ఉండడంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు చెబుతున్నారు.

నిరంతర పర్యవేక్షణ..

పనుల కోసం బయటప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు వాగు ఉధృతిపై నిరంతరం పర్యవేక్షణతో నడుచుకోవాల్సి వస్తోంది. ఊరుకు వెళ్లిన గ్రామస్తులు తిరిగి వచ్చే క్రమంలో గ్రామంలో ఉన్న కుటుంబసభ్యులకు వాగు ప్రవాహంపై అంచనా వేసి ఆరా తీసి రావాల్సి వస్తుందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తమ సమస్యను గమనించి బుగ్గవాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని సమీప గ్రామస్తులు, ప్రయాణికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్ ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957